

పర్యాటక ప్రాంతాలు కిటకిట

ప్రజాశక్తి-అనంతగిరి:మండలంలోని పర్యాటక ప్రాంతాలు కిటకిటలాడాయి. బొర్రా గుహలు, కటికి, తాడిగుడ, చిట్టంపాడు. ప్రాంతాల్లో పర్యాటకుల తాకిడి నెలకొంది. ఆదివారం సెలవు దినం కావడంతో కుటుంబ సమేతంతో వేలాది మంది తరలి వచ్చారు. ఘాట్ రోడ్డు, శివలింగపురం, డముకు, అనంతగిరి ప్రాంతాలు జనాలతో కిటకిటలాడాయి. బొర్రా గుహల్లో అందాలను తిలకించారు. కటకి, చిట్టంపాడు, తాడిగూడ జలపాతాలను సందర్శించి స్నానాలు చేస్తూ ఉత్సాహంగా గడిపారు. కాఫీ ప్లాంటేషన్, అరకు ట్రైబల్ మ్యూజియం, పద్మపురం గార్డెన్‌లో సందడి నెలకొంది.



బొర్రా గుహల్లో పర్యాటకులు

మన్యంలో సిఐటియు సమరశీల పోరాటాలు

- ఐక్య ఉద్యమాలతో విజయాలు
- సమస్యల పరిష్కారంలో సఫలీకృతం
- 20, 21 తేదీల్లో అల్లూరి జిల్లా మహాసభలు

ప్రజాశక్తి-పాడేరు:గిరిజన ప్రాంతంలో సిఐటియు అనేక సమరశీల పోరాటాలు చేసింది. గిరిజన ప్రాంతంలో కార్మికులందరినీ ఐక్యం చేసి పోరాటాల గడ్డగా ఏజెన్సీకి సిఐటియు పేరు తీసుకొచ్చింది. రెండున్నర దశాబ్దాలుగా అలుపెరగని ఉద్యమాలు సాగించి కార్మికుల సమస్యలు, డిమాండ్లపై న్యాయ పరిష్కారానికి కృషి చేసింది. ఈ నేపథ్యంలో ఈనెల 20, 21 తేదీలలో అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు కేంద్రంలో సిఐటియు ప్రథమ మహాసభలు జరగ నున్నాయి. ఈ మేరకు మహాసభలు విజయవంతానికి ఏజెన్సీలో పలు మండలాల్లో ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. అన్ని రంగాల కార్మికులు, కర్షకులు, ఉద్యోగులు, అందరూ తరలి రావాలని ప్రచారం చేపడుతున్నారు. మహాసభల సందర్భంగా సిఐటియు మన్యంలో చేపట్టిన పోరాటాలు

- 2000 సంవత్సరంలో అరకు వ్యాలీ హెచ్ఎన్‌టిసి పద్మాపురం గార్డెన్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సాగించిన పోరాటం సిఐటియుకి మంచి గుర్తింపునిచ్చింది. ఉద్యోగ భద్రత, కనీస వేతనం కోసం పోరాడుతున్న కార్మికులను ఐటిడిఏ పోలీసులతో ఉద్యమాన్ని అణిచివేసి కార్మికులను జైల్లో కూడా పెట్టారు. దీనికి వ్యతిరేకంగా సిఐటియు ఏజెన్సీ వ్యాప్తంగా కార్మికులందరినీ ఐక్యం చేసి పెద్ద ఎత్తున పోరాడి విజయం సాధించింది.

-ఏజెన్సీలో క్షేత్రస్థాయిలో సేవలు అందిస్తున్న కమ్యూనిటీ హెల్త్ వర్కర్లకు కేవలం నెలకు రూ.300ల జీతంతో పని చేసేవారు. దీనికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమించి విజయం సాధించారు. పోరాట ఫలితంగా ప్రస్తుతం ఆశాలుగా ఉంటూ నెలకు పదివేల రూపాయలు అందుకుంటున్నారు.

- పాడేరు, చింతపల్లి, జికె వీధి, పెదబయలు, అరకు, అనంతగిరి మండలాల్లో కాఫీ కార్మికులు సమస్యలపై అనేక పోరాటాలు సిఐటియు నిర్వహించింది.కాఫీ పళ్ళు సేకరణ, కూలి రేట్లు పెంచాలని సీనియర్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, అనేక దపాలుగా సమ్మెలు, ముట్టడి వంటి కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహించింది.

-అరకు ఏపీ టూరిజంలో పని చేస్తున్న కార్మికులకు ఉద్యోగ భద్రత, కనీస వేతనం ఇవ్వాలని పెద్ద ఎత్తున 2010లో ఉద్యమించి సమ్మెకు దిగి టూరిజం కార్పొరేషన్ యాజమాన్యాన్ని అరకుకి రప్పించి సమస్యలు పరిష్కరించుకొని విజయం సాధించుకున్నారు.

-గిరిజన ఆశ్రమ పాఠశాలలో పని చేస్తున్న కార్మికుల సమస్యలపై అనేక పోరాటాలు నిర్వహించారు. ఫలితంగా జీతాలు పెంచుకొని కొంతమందిని రెగ్యులర్ అయ్యారు.

- 2016 సంవత్సరంలో చింతపల్లి హెచ్ఎంటిసి, అరకు, కొత్తవలస, పద్మాపురం గార్డెన్, గిరిజన మ్యూజియం కార్మికులు సమ్మె చేసి కలెక్టర్ గెజిట్ జీవో ప్రకారం వేతనాలు సాధించుకున్నారు. జీసిసి సోప్ యూనిట్లో పని చేస్తున్న కార్మికులు 40 రోజులు సమ్మె చేసి పీస్ రేటు ప్రకారం కూలి చెల్లిస్తున్న కార్మికులకు నెల జీతం సాధించుకున్నారు. పాడేరు, అరకులో పని చేస్తున్న ఏరియా ఆసుపత్రి పారిశుధ్య కార్మికులకు వేతనాలు పెంచాలని పోరాట ఫలితంగా వేతనాలు పెంచుకొని విజయం సాధించుకున్నారు. అదేవిధంగా భవన నిర్మాణ కార్మికులకు కరోనా సమయంలో ఆర్థికంగా ఆదుకోవాలని పెద్ద ఎత్తున సిఐటియు ఆధ్వర్యంలో ఉద్యమించారు. అంగన్వాడి, ఆశ, వివో ఏలు, మిడ్ డే మీల్స్ కార్మికులపై ఉన్నతాధికారులు, రాజకీయ నాయకుల వేధింపులను ఆపాలని పెద్ద ఎత్తున సిఐటియు ఉద్యమించింది. అనేక రంగాల్లోని గిరిజన కార్మికుల సమస్యల పరిష్కారానికి, హక్కుల సాధనకు చేసిన పోరాట పదంలో సిఐటియు సఫలీకృతం అయింది.



సిఐటియు ఆధ్వర్యంలో ఆందోళన చేపడుతున్న మహిళా కార్మికులు (ఫైల్ ఫోటో)

సిఐటియు మహాసభలు జయప్రదం చేయండి

సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు
బోనంగి చిన్నయ్య పడాల్, వి.ఉమామహేశ్వరరావు

ఈనెల 20, 21 తేదీలలో సిఐటియు అల్లూరి సీతారామరాజు జిల్లా ప్రథమ మహాసభలు పాడేరు కేంద్రంలో జరుగుతున్నాయి. కార్మిక వర్గం జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బోనంగి చిన్నయ్య పడాల్, వి.ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు. కార్మిక సమస్యలపై నిరంతరం రాజీలేని పోరాటాలు అనేక మైనవి పాడేరు జిల్లా వ్యాప్తంగా జరిగాయని, భవిష్యత్తులో కార్మికులు సమస్యలపై పెద్ద ఎత్తున ఉద్యమించడానికి ఈ మహాసభలో చర్చించి ప్రణాళిక రూపొందిస్తామని తెలిపారు. గతంలో ప్రపంచాన్ని కుదిపేసిన కరోనా మహమ్మారితో కార్మిక వర్గం తీవ్రంగా నష్టపోయిందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎటువంటి సహాయ సహకారాలు అందించకుండా కార్మికులను నడిరోడ్డుపై వదిలేసిందని తెలిపారు. కరోనా సమయంలో సిఐటియు కార్మిక వర్గానికి అండగా ఉంటూ అనేక సేవా కార్యక్రమాలు చేసిందని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక హక్కుల్ని కాలరాసే విధంగా చట్టాలు తీసుకొస్తున్నాయని, దీనికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమించడానికి కార్మిక వర్గం సిద్ధంగా ఉండాలని కోరారు. మహాసభల సందర్భంగా ఈనెల 20న పెద్ద ఎత్తున ప్రదర్శన, బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు.

కీచకునిపై పోక్సో కేసు

ప్రజాశక్తి - రంపచోడవరం

మండలంలోని కాకవాడ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాలలో బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఆ పాఠశాల హెచ్ఎం భర్త ప్రసాద్‌పై ఎట్టకేలకు పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. ఈ విషయాన్ని రంపచోడవరం ఎఎస్పి మోహన్ కుమార్ ఆదివారం ధ్రువీకరించారు. ఈ కేసులో నిందితుడిని ఇంకా అరెస్టు చేయలేదని పోలీసులు పేర్కొన్నారు. ఈ పాఠశాలలో ఇటీవల జరిగిన ఘటనకు సంబంధించి ఎస్టీ కమిషన్ చైర్మన్ పర్యటన అనంతరం ప్రభుత్వ యంత్రాంగంలో కదలికలు వచ్చాయి. కాకవాడ బాలికల ఆశ్రమ పాఠశాల హెచ్ఎం భర్త ప్రసాద్ అదే పాఠశాలలో గిరిజన బాలికలను లైంగికంగా వేధించినట్టు ఆరోపణలు రావడంతో గిరిజనులు, గిరిజన సంఘం నేతలు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున ఆందోళన చేయడంతో ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభ రవిబాబు స్పందించి పాఠశాలను సందర్శించారు. దీంతో అధికారులు, పోలీసులు ఈ కేసుపై స్పందించి విచారణ చేస్తున్నారు. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రసాద్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అన్ని వర్గాల నుంచి డిమాండ్ రావడంతో పోలీసులు ఎఫ్ఐఆర్‌ను మార్పు చేశారు. ముందు వేసిన ఎఫ్ఐఆర్‌లో (447, 324, 323, 506 ఆర్/డబ్ల్యు 34 ఐపిసి)కి అదనంగా పోక్సో యాక్ట్, 354కె, 354, సెక్షన్లతో రంపచోడవరం పోలీసులు ఆల్టర్ చేశారు. కాగా ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న ప్రసాద్ ఇంకా పరారీలో ఉన్నాడు. కాకవాడ పాఠశాల హెచ్ఎం కుంజం పావని, వార్డెన్ కొమరం బాబనమ్మను ఐటీడీఏ అధికారులు సస్పెండ్ చేశారు. కాగా అనధికారికంగా కొనసాగుతున్న హెచ్ఎం సోదరి కుంజం సీతాదేవిని మారేడుమిల్లి మండలం వేటుకూరుకు బదిలీ చేసినట్టు అధికారులు తెలిపారు.



నిందితుడు ప్రసాద్

ఎపిఎఫ్‌డిసి ఎస్టేట్‌లో కాఫీ తోటల పునరుద్ధరణ

'ప్రజాశక్తి'తో ఎపిఎఫ్‌డిసి డిఎం జి.కృష్ణబాబు





ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి జిల్లా ఏజెన్సీలో ఉన్న ఆంధ్రప్రదేశ్ అటవీ అభివృద్ధి సంస్థ(ఏపీఎఫ్‌డిసి) ఎస్టేట్‌లలో ఐదేళ్ల పంచవర్ష ప్రణాళిక కింద కాఫీ తోటల పునరుద్ధరణ కార్యక్రమం చేపట్టినట్లు ఏపీఎఫ్‌డిసి పాడేరు డివిజనల్ మేనేజర్ జి.కృష్ణబాబు వెల్లడించారు. 2014 సంవత్సరంలో ఏర్పడిన హుదూద్ తుఫాన్ కారణంగా ఏపీఎఫ్‌డిసి ఎస్టేట్‌లలో కాఫీ తోటలకు భారీ నష్టం వాటిల్లిందని తెలిపారు. ముఖ్యంగా కాఫీ తోటలకు నీడనిచ్చే చెట్లు నేల కొరగడంతో గత ఐదేళ్ల నుంచి భారీగా కాఫీ, మిరియాల దిగుబడి భారీగా తగ్గి పోయిందని చెప్పారు.ఈ క్రమంలో దాదాపు ఏపీఎఫ్‌డిసి లోని అన్ని ఎస్టేట్‌లలో కూడా రీప్లాంటేషన్ చేపట్టవలసిన అవసరం ఏర్పడిందని, ఈ మేరకు 2021 22 నుంచి 2025 -26 వరకు కాఫీ తోటల పునరుద్ధరణ కార్యక్రమం చేపట్టినట్లు ఆయన వివరించారు.మరిన్ని విషయాలు ప్రజాశక్తితో ఆయన పంచుకున్నారు.

కాఫీ దిగుబడి తగ్గడానికి కారణం

40 ఏళ్ల క్రితం కాఫీ ప్లాంటేషన్ ఎస్టేట్‌లలో కూడా కాఫీ తోటలకు తెగుళ్ల సంక్రమించి క్రమేణ పంట దిగుబడి గణనీయంగా పడిపోయింది. కాఫీ ఎస్టేట్లో ఎక్కువ విస్తీర్ణంలో ఉన్న కావేరి రకం కాఫీ తోటలకు రస్ట్ డిసీజ్ సోకడంతో కాఫీ మొక్కలు నశించిపోయాయి. దీంతో మరింత దిగుబడి తగ్గింది.

కాఫీ కొత్త వంగడాలు పెంపకం

కొత్తగా చేపట్టే కాఫీ తోటల పునరుద్ధరణకు చింతపల్లి ఆర్‌వి నగర్ మినుములూరు ఎస్టేట్‌లలో నర్సరీలు ఏర్పాటు చేశాం. మేలు రకమైన అధిక దిగుబడి నిచ్చే కొత్త వంగడాలు పెంపకం చేపట్టాం. ఇవి సెలక్షన్ 9, చంద్రగిరి ఎస్ 5 బి రకం ఉన్నాయి. చింతపల్లి డివిజన్ లో రెండున్నర లక్షలు, ఆర్‌వి నగర్ డివిజన్లో రెండున్నర లక్షలు, పాడేరు డివిజన్‌లో రెండు లక్షల పది వేల మొక్కల పెంపకం చేస్తున్నాం.

కాఫీ, నీడనిచ్చే మొక్కల పెంపకం

కాఫీ ఎస్టేట్‌లలో ఈ తోటల పునరుద్ధరణ కార్యక్రమంలో భాగంగా నాలుగు వేల హెక్టార్లలో కాఫీ తోటలు, 2 వేల హెక్టార్లలో నీడనిచ్చే మొక్కల పెంపకం చేపడుతున్నాం.

కూలి రేట్ల పెంపుపై చర్యలు ఏమిటి?

ప్రస్తుతం కార్మికులకు రోజు కూలి రూ.273ల చొప్పున చెల్లిస్తున్నాం. కాఫీ పళ్ళ సేకరణకు ఐదు రూపాయల 20 పైసలు చొప్పున చెల్లించడం జరుగుతుంది. కార్మికులు కోరుతున్న విధంగా ప్రభుత్వ గెజిట్ ప్రకారం రోజు కూలి రూ.299.14 పైసల చొప్పున కిలో కాఫీ పళ్ళ సేకరణకు ఐదు రూపాయల అరవై తొమ్మిది పైసలు చొప్పున చెల్లించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం..



రామచంద్రయ్య కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న కిరణ్ తదితరులు

రామచంద్రయ్య కుటుంబానికి ఎస్ఎఫ్ఐ మాజీ నేతల ఆర్థిక సాయం

ప్రజాశక్తి-విఆర్.పురం

కూనవరం మండలం, రేపాక గ్రామానికి చెందిన గొంది రామచంద్రయ్య కుటుంబాన్ని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) మాజీ నాయకులు ఆదివారం పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. విద్యార్థి సంఘం ఎస్ఎఫ్ఐలో గతంలో రామచంద్రయ్య పని చేశారు. ఆయన అనారోగ్యంతో ఈ నెల 15న మరణించారు. దీంతో ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు రేపాక గ్రామానికి ఆదివారం వెళ్లి రామచంద్రయ్య కుటుంబాన్ని పరామర్శించి రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుటుంబానికి ఎప్పటికీ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు బి.కిరణ్, వి.వినోద్, కె.నగేష్, ఎం రవితేజ, లెనిన్, ఎం నాగమణి, అమ్మాజీ, స్థానిక ప్రజా సంఘాల నాయకులు యర్రంశెట్టి శ్రీనివాసరావు, మేకల నాగేశ్వరరావు, బొర్రయ్య, సత్యనారాయణ, తమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న తిరుపతిరావు, దాతలు

నిమ్మగడ్డలో తీరిన తాగునీటి సమస్య

-శారద ట్రస్ట్ ఆధ్వర్యంలో గ్రావిటీ పథకం ఏర్పాటు

ప్రజాశక్తి-డుంబ్రిగూడ:ఎన్నో ఏళ్ల నుంచి తాగునీటి సమస్యతో ఇబ్బంది పడుతున్న మండలంలోని కురిడి పంచాయతీ నిమ్మగడ్డ గ్రామానికి ఆ సమస్య తీరింది. ఎన్నారై దంపతులు వడ్లాని కాశయ్య, విజయ కుమారి దంపతుల రూ.4 లక్షల ఆర్థిక సహాయంతో శారద ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆ గ్రామంలో సురక్షిత తాగునీటి పథకాన్ని నిర్మించారు. నూతనంగా నిర్మించిన గ్రావిటీ పథకాన్ని ఆదివారం శారదా ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టి వి.తిరుపతిరావు, ఎన్నారై దంపతులు వడ్లాని కాశయ్య, విజయ కుమారి దంపతులు ప్రారంభించారు. ప్రారంభించడానికి వెళ్లిన ప్రతినిధులకు ఆ గ్రామస్తులు పూలదండలతో ఆహ్వానించారు. అనంతరం శారదా ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ వి.తిరుపతిరావు మాట్లాడుతూ, ఏజెన్సీ మారుమూల గిరిజన గ్రామాల్లో సురక్షిత తాగునీటి సౌకర్యం లేక కలుషితమైన నీటిని ఉపయోగిస్తూ అనేకమంది గిరిజనులు పలు రకాల వ్యాధుల బారినపడి మృత్యువాత పడుతున్న సంఘటనలు ఉన్నాయన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు గాను కొన్ని గ్రామాల్లో ట్రస్ట్ ఆధ్వర్యంలో సురక్షిత తాగునీటి పథకాలను నిర్మిస్తున్నామని చెప్పారు. ఎన్నారైల ఆర్థిక సహకారంతో ఇటువంటి పథకాలను నిర్మిస్తున్నామని, వీటిని గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ గ్రావిటీ పథకం నిర్మాణానికి విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ రిటైర్డ్ డిజిఎం మంత్రి శ్రీనివాసరావు, జగదీశ్వర్‌రావులు సహకారం అందించారు. ఈ కార్యక్రమంలో శారద ట్రస్ట్ ఇంజనీర్ సిహెచ్ సత్యనారాయణ, కోఆర్డినేటర్ వి.రత్నం, కురిడి పంచాయితీ సర్పంచ్ లచ్చు, ఎంపిటిసి మహాదేవ్, పార్టీ సభ్యుడు బాబురావు, గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌బి పోతురాజు, మండల కార్యదర్శి పి సత్యనారాయణ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

అన్ని తరగతుల ప్రజలకూ అన్యాయం

- టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి శ్రావణ్ కుమార్

ప్రజాశక్తి-పెదబయలు రూరల్: అన్ని వర్గాల ప్రజలకు సిఎం జగన్‌మోహన్ వెన్నుపోటు పొడిచారని మాజీ మంత్రి, టిడిపి అరకు నియోజకవర్గ ఇన్చార్జ్ కిడారి శ్రావణ్ కుమార్ విమర్శించారు. మండలంలో గలగండ పంచాయతీ సిరసపల్లి గ్రామంలో మండల అధ్యక్షురాలు సీకరి సుకుమారి ఆధ్వర్యంలో ఆదివారం ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో శ్రావణ్ పాల్గొన్నారు. ప్రతి ఇంటికి తిరిగి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని ఇదేం కర్మ మన రాష్ట్రానికి కరపత్రాలను అందించారు. గ్రామాలలో సమస్యలను గ్రామస్తులు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. అనంతరం శ్రావణ్ మాట్లాడుతూ, వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి పాలయిందన్నారు. అన్నింటి ధరలు పెంచేసి సామాన్య ప్రజల నడ్డి విరుస్తుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఎస్.వెంకటేష్, కే.భూషణం పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న నాయకులు

నిబంధనలకు పాతర

- గుండాల ఇసుక ర్యాంపులో యథేచ్ఛగా తవ్వకాలు
- పక్క రాష్ట్రం వేబిల్‌తో తరలింపు
- గిరిజన చట్టాలను బేఖాతరు చేస్తున్న వైనం



గుండాల ఇసుక ర్యాంపులో జెసిబితో తవ్వకాలు చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - ఎటపాక

గోదావరి చెంతనే గ్రామాలున్నా ట్రక్కు ఇసుక కావాలంటే ఒక యజ్ఞం చేయాల్సిందే. గిరిజనులు ఇల్లు కట్టుకోడానికి, మిర్చి కల్లాల్లోకి ఇసుక కావాలంటే సవాలక్ష నిబంధనలు పాటించాలి. స్థానిక అధికారుల నుండి ఐటిడిఏ అధికారుల వరకు అనేక ఆంక్షలు పెడుతున్నారు. ఎవరైనా ధైర్యం చేసి ఇసుక తోలుతే కేసుల వరకు వెళ్ళాల్సిందే. అలాంటిది మండలంలోని గుండాల ఇసుక రాంపులో యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు చేస్తూ పక్క రాష్ట్రాలకు లారీల్లో తరలిస్తున్నా పట్టించుకునే నాథుడే లేడు. ఈ ఇసుక ర్యాంపు పెద్దలకు కాసుల పంటగా మారింది. లారీలు, ట్రాక్టర్లలో ఇసుకను పక్క రాష్ట్రాలకు తరలిస్తూ ప్రజా సంపదను దోచుకుంటున్నారు. దీనిపై ప్రశ్నిస్తే అనుమతులున్నాయని నిర్వాహకులు చెబుతున్నారు. అనుమతుల విషయం పక్కన పెడితే, ఇక్కడ ఇసుక అమ్మకం కూడా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పక్క రాష్ట్రం చత్తీస్‌ఘడ్ వేబిల్‌తో ఇతర రాష్ట్రాలకు ఇసుకను అక్రమ రవాణా చేస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా రోజుకు 20 నుంచి 30 వరకు లారీలు, ట్రాక్టర్లతో ఇసుకను పక్క రాష్ట్రాలకు తరలిస్తున్నట్లు తెలుస్తోంది.

గిరిజన చట్టాలు బేఖాతరు...

ఏజెన్సీలో ఎటువంటి ఖనిజ సంపద తవ్వకాలు చేయాలన్నా 1/70, పీసా చట్టాల ప్రకారం గ్రామసభ నిర్వహించి స్థానిక పంచాయతీ అనుమతి పొందాల్సి ఉంది. గ్రామసభ ఆమోదం లేకుండా ఏ అధికారికీ ఖనిజ సంపద తవ్వకాలకు అనుమతులు ఇచ్చే అధికారం లేదు. అసలు గ్రామసభే నిర్వహించలేదని, ఇక్కడ ఇసుక తవ్వకాలకు తమ పంచాయతీ నుంచి ఎటువంటి ఆమోదం తెలియజేయలేదని స్థానిక పంచాయతీ నాయకులు చెబుతున్నారు. ప్రభుత్వ నిబంధనలు ప్రకారం ఏజెన్సీలో స్థానిక గిరిజన సొసైటీలకు మాత్రమే క్వారీ నిర్వహించే అధికారం ఉంది. అది కూడా మనుషులతో మాత్రమే తవ్వకాలు చేయాలి. నిబంధనలు ప్రకారం ఏజెన్సీలో ప్రైవేటు వ్యక్తుల ఆధ్వర్యంలో ఇసుక ర్యాంపు నిర్వహణ చేయడానికి వీల్లేకపోగా, ఇక్కడ గిరిజనేతరులు, అందులోనూ స్థానికేతరులు జెసిబిలతో ఇష్టానుసారంగా ఇసుక తవ్వకాలు చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలను, గిరిజన చట్టాలను తుంగలో తొక్కి గుండాల ఇసుక ర్యాంపుకు అనుమతులు ఎలా ఇచ్చారని ఆదివాసీ సంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు. అందువల్ల చట్టాలకు, నిబంధనలకు వ్యతిరేకంగా ఉన్న గుండాల ఇసుక ర్యాంప్‌ను మూసివేయాలని, లేకుంటే పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని గిరిజన సంఘాల నాయకులు హెచ్చరిస్తున్నారు.

నిర్వాహకులు, అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

గుండాల ఇసుక ర్యాంప్‌కు ఏ నిబంధనలకు అనుగుణంగా అనుమతులు ఇచ్చారు? ఏజెన్సీలో గిరిజనేతరులకు ఇసుక ర్యాంప్ కేటాయించడం చట్ట వ్యతిరేకం. ఇసుక ర్యాంపు నిర్వాహకులపై, అనుమతులు ఇచ్చిన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. తక్షణమే గుండాల ఇసుక ర్యాంపును మూసివేయాలి. లేకుంటే ప్రజలతో ఇసుక క్వారీ ముట్టడిస్తాం. మూసివేసేదాకా పోరాడుతాం.

- కాకా అర్జున్ దొర, ఎపి గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు





గుండాల ఇసుక ర్యాంపు నుంచి లారీల్లో తరలిస్తున్న ఇసుక,



ఇసుక కోసం క్యూ కట్టిన లారీలు

నేడు మారేడుబాకలో 'గడపగడపకు మన ప్రభుత్వం'

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

మండలంలోని మారేడుబాక పంచాయతీలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం నిర్వహిస్తున్నట్లు సొసైటీ అధ్యక్షులు సింగిరెడ్డి రామకృష్ణ, ఎంపీడీవో కె బాపన్న దొర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి పాల్గొంటారని, పంచాయతీలోని మారేడుబాక, ఉర్లాకులపాడు జి.శరభవరం తదితర గ్రామాల్లో పర్యటిస్తారని తెలిపారు.



ఒడిశా జర్నలిస్టు నాయకులతో చింతూరు పాత్రికేయులు

జర్నలిస్టుల సమస్యలపై ఐక్య పోరాటాలు

ప్రజాశక్తి- చింతూరు

జర్నలిస్టులపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరికి వ్యతిరేకంగా, జర్నలిస్టుల సమస్యలపై అంతరరాష్ట్ర ఐక్య పోరాటాలు నిర్వహించాలని సీనియర్ పాత్రికేయులు పిలుపునిచ్చారు. ఒడిశా రాష్ట్రం మల్కనగిరి జిల్లా కేంద్రంలో మల్కన్‌గిరి యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్ 51వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని అంతర్రాష్ట్ర జర్నలిస్టుల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒయుజె జర్నలిస్ట్ యూనియన్ అధ్యక్షులు ప్రసన్న మహంతి మాట్లాడుతూ ప్రభుత్వాలు జర్నలిస్టులకు రాయితీలు ఇవ్వకుండా, బీమా సౌకర్యం కల్పించకుండా, నివాస స్థలాలు, పక్కా గృహాలు మంజూరు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నాయని తెలిపారు. ఎంయుజె అధ్యక్షులు దేవి ప్రసాద్ దాస్ మాట్లాడుతూ జర్నలిస్టుల కుటుంబాలకు జీవిత బీమా, పిల్లలకు విద్య, వైద్యం సౌకర్యాలు కల్పించాలన్నారు. వార్తలు సేకరించే వృత్తిలో ఉన్న వర్కింగ్ జర్నలిస్టులపై ఇటీవల దాడులు అధికమయ్యాయని, వారి నుంచి జర్నలిస్టులకు ప్రభుత్వం రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. మల్కన్‌గిరి జిల్లా కలెక్టర్ విశాల్ సింగ్ మాట్లాడుతూ ప్రభుత్వపరంగా అన్ని సౌకర్యాలపై ప్రభుత్వానికి తెలియజేస్తామన్నారు. మల్కన్‌గిరి ఎస్‌పి వడ్వాని మాట్లాడుతూ ప్రమాదాల సమయంలో అప్రమత్తం చేస్తూ ప్రజా సేవలో అంకితమవుతున్నారని తెలిపారు. ఒడిశా ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వెల్ఫేర్ మంత్రి జగన్నాథ్ సర్క, మల్కన్‌గిరి, చిత్రకొండ ఎమ్మెల్యేలు ఆదిత్య మాడి, పూర్ణచంద్ర బకా మాట్లాడారు. ప్రజా సమస్యలపై ప్రచురించిన కథనాలకు ప్రభుత్వాల నుంచి సత్ఫలితాలు వచ్చిన పాత్రికేయులను వేదికపై పురస్కారాలు, శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఒడిశా పాత్రికేయులతో పాటు ఆంధ్రప్రదేశ్ అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండల కేంద్రం నుండి సీనియర్ పాత్రికేయులు ఎంబి చారి, ఎస్‌కె.జానీ, ఎస్‌కె.షాజహాన్, పులిపాటి కుమార్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రం ఏర్పాటుకు కలెక్టర్ హామీపై హర్షం

ప్రజాశక్తి -సీలేరు

జికె.వీధి మండలం, సీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ ఏడాది పరీక్ష కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇవ్వడంపై వైసీపీ నాయకులు కృష్ణమూర్తి హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సీలేరు జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రాన్ని జీకే వీధి తరలించడం పట్ల విద్యార్థులు పరీక్ష కేంద్రానికి వెళ్లడానికి అనేక ఇబ్బందులు గురవుతున్నారని, ఈ విషయాన్ని ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి దృష్టి తీసుకెళ్లడంతో ఆమె స్పందించారని తెలిపారు. ఈ మేరకు సీలేరులో ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని యధావిధిగా కొనసాగించాలని జిల్లా కలెక్టర్‌కు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి అనేకసార్లు విన్నవించగా, ఇటీవల గుమ్మరేవుల పంచాయతీలో పర్యటించిన కలెక్టర్ సుమిత్ కుమార్ ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని యధావిధిగా కొనసాగించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

అనంతబాబును కఠినంగా శిక్షించాలి

- టిడిపి నాయకులు నేతల నాగేశ్వరరావు

ప్రజాశక్తి- నర్సీపట్నంటౌన్: దళిత యువకుడిని హత్య చేసిన వైసిపి ఎమ్మెల్సీ అనంతబాబుకు ఆ పార్టీ నేతలు కొమ్ము కాయడం సిగ్గుచేటని నర్సీపట్నం టీడీపీ నాయకులు నేతల నాగేశ్వరరావు ఆరోపించారు. ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, దళిత యువకుడిని అత్యంత కిరాతకంగా హత్య చేసిన వైసిపి ఎమ్మెల్సీ అనంతబాబుకి కోర్టు షరతులతో కూడిన బెయిల్ ఇవ్వడంతో విడుదలైన ఆయనకు అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికి ఊరేగించడం దారుణమన్నారు. ఈ ఘటనతో వైసిపి ప్రభుత్వం దళిత వ్యతిరేక ప్రభుత్వమని రుజువు అయిందన్నారు. చిన్న చిన్న నేరాలు చేసిన దళితులు, బలహీన వర్గాల వారు సంవత్సరాల తరబడి జైల్లో మగ్గుతున్నారన్నారు. రాష్ట్రంలో దళితులు ఎమ్మెల్సీ అనంతబాబుకి రాజకీయ స్థానం లేకుండా భూస్థాపితం చేయడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. తక్షణమే అనంతబాబు బెయిల్ రద్దు చేసి నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

క్రీడలతో యువతకు ఉద్యోగావకాశాలు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ నెహ్రూ యువ కేంద్రం, శ్రీ వేమ ఎన్జీవో (వేములపూడి) ఆధ్వర్యంలో బ్లాక్ లెవెల్ స్పోర్ట్స్ స్థానిక ఎస్సై ధనుంజరాయుడు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ, క్రీడలతో యువతకు మంచి ఉద్యోగ అవకాశాలు వస్తాయని, ప్రతి ఒక్కరూ హార్డ్ వర్క్‌ను నమ్ముకోవాలని తెలిపారు. శ్రీ వేమ ఎన్జీవో సెక్రటరీ బొలెం శివ మాట్లాడుతూ, ఈ పోటీలు మూడు రోజులపాటు జరుగుతాయని, వీటిలో కబడ్డీ, కోకో,వాలీబాల్, రన్నింగ్, షాట్ పుట్, క్యారం బోర్డ్, చెస్ వంటి క్రీడలు నిర్వహిస్తున్నామని తెలిపారు.ఈ పోటీలో పాల్గొన్న వారికి కేంద్ర ప్రభుత్వ సర్టిఫికెట్లు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సాయి రూరల్ డెవలప్మెంట్ సొసైటీ సెక్రటరీ సాయి, వెలగ జగన్నాథ్, మాకిరెడ్డి రవి, శ్రీను, డిడియు జీవీకే సిబ్బంది లక్ష్మీనారాయణ, హరి ,తదితరులు పాల్గొన్నారు.

21న రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-మాకవరపాలెం:ఈనెల 21న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు సందర్భంగా ఏర్పాటు చేసే రక్తదాన శిబిరం పోస్టర్‌ను ఎంపీపీ సత్యనారాయణ ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. 21న ముఖ్యమంత్రి జన్మదినం సందర్భంగా భారీ రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. శిబిరానికి భారీ స్థాయిలో కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు వాసు, వైస్ ఎంపీపీలు లక్ష్మీ రాజారావు, సీనియర్ నాయకులు పెట్ల భద్రాచలం, మూకల బాలకృష్ణ పాల్గొన్నారు.

స్వరరంజని రికార్డు స్థాయి గేయాలాపన

ప్రజాశక్తి- సీతమ్మధార : సమయం వృథా కాకుండా పాటలు పాడడం ద్వారా స్వరరంజని కళాకారులు, గాయకులు రికార్డులు సృష్టించారని సంస్థ ప్రధాన కార్యదర్శి కోరుకొండ రంగారావు తెలిపారు. ఆదివారం పౌరగ్రంథాలయంలో స్వరరంజని ఆధ్వర్యంలో 41మంది సినీ గేయ కళాకారులు ఏకధాటిగా విరామం లేకుండా 170 పాటలు పాడడం సంతోషంగా ఉందన్నారు. వీటిని లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్సులో స్థానం కోసం పంపనున్నట్లు రంగారావు తెలిపారు. ఇప్పటికే స్వరరంజని లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్, ఇంటర్నేషనల్ వండర్ రికార్డ్స్, మిరాకిల్ వరల్డ్ రికార్డ్స్, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్సులో చోటు పొందిందని స్వరరంజని ప్రధానకార్యదర్శి కోరుకొండ రంగారావు తెలిపారు.

స్కేటింగ్ పోటీల్లో అక్కాతమ్ముళ్ల ప్రతిభ

ప్రజాశక్తి -భీమునిపట్నం : బెంగుళూరులో జరిగిన 60వ జాతీయస్థాయి స్కేటింగ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో మండలంలోని మూలకుద్దు పంచాయతీ కొత్త మూలకుద్దు గ్రామానికి చెందిన అక్క కార్తీక, తమ్ముడు లోహిత్‌రెడ్డి అద్భుతమైన ప్రతిభ కనబరిచారు. కార్తీక రజత పతకాన్ని సాధించగా, లోహిత్ రెడ్డి ఏకంగా రెండు స్వర్ణం, ఒక రజత పతకాన్ని సాధించాడు. వీరిని పంచాయతీ సర్పంచ్ కొల్లి పార్వతి, వైసిపి యూత్ ప్రెసిడెంట్ కోటిరెడ్డి ఆదివారం అభినందించారు.గ్రామీణ ప్రాంతం నుంచి జాతీయ స్థాయి స్కేటింగ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో ప్రతిభ కనబరచడం, క్రీడల పట్ల వారిద్దరికీ ఉన్న పట్టుదలకు నిదర్శనమన్నారు. నగరంలోని ఒక ప్రైవేటు పాఠశాలలో కార్తీక ఆరోతరగతి, లోహిత్‌రెడ్డి రెండో తరగతి చదువుతున్నారు.

హైడ్రోపవర్ ప్రాజెక్టుపై మోసపూరిత ప్రకటనలు

- 4800 ఉద్యోగాలు కల్పన ఒట్టిమాటే
- పరోక్షంగా 32 గ్రామాలు ప్రభావితం
- ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ జాతీయ కార్యవర్గ సభ్యులు అప్పలనర్స



మాట్లాడుతున్న అప్పలనర్స

ప్రజాశక్తి-పాడేరు:ఎర్రవరం హైడ్రోపవర్ ప్రాజెక్టు నిర్మాణంలో చిన్నయ్యకొండ మాత్రమే మునుగుతుందని, ప్రాజెక్టులో 4,800 మందికి ఉద్యోగం కల్పిస్తామని ఎన్‌ఆర్‌డిసి ఏవీపిసి అండ్ ఎండి రమణరెడ్డి ప్రకటనను ఖండిస్తున్నామని గిరిజన సంఘం ఆదివాసి అధికార రాష్ట్రీయ మంచ్ జాతీయ కార్యవర్గ సభ్యులు అప్పలనర్స తెలిపారు. స్థానిక గిరిజన సంఘం కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎర్రవరం హైడ్రో పవర్ ప్రాజెక్టులో ఒక్క గ్రామం కాదు.. కదా ఒక్క ఇల్లును కూడా మునగనివ్వమని, హైడ్రో పవర్ ప్రాజెక్టులో విద్యుత్ ఉత్పత్తి నిమిత్తం అప్పర్ డ్యామ్, పరోక్షంగా సుమారు 32 గ్రామాలు ప్రభావితం అవుతాయన్నారు. ప్రాజెక్టులో 4800 ఉద్యోగాలు కల్పిస్తామని ఎండి ప్రకటించడం మోసపూరితమన్నారు. ఎర్రవరం హైడ్రోపవర్ ప్రాజెక్టులో 4800 ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పడం గిరిజనులను మోసం చేయడమే అన్నారు.ఎర్రవరంలో కేవలం 1000 మందికి ఉపాధి కల్పించినప్పటికీ పవర్ ప్రాజెక్టు కావడం హైస్కిల్ (నైపుణ్యత కలిగిన పనుల్లో) డిప్లొమా, ఇంజనీరింగ్, ఐటిఐ మొదలగు విద్యావంతులు చాలా తక్కువ మంది ఉంటారన్నారు. ఇప్పటికే సీలేరు మాచ్ ఖండ్ పవర్ ప్రాజెక్టులో ఉద్యోగ ఉపాధి అవకాశాలు స్థానిక గిరిజనులకు కేటాయించకపోవడంతో నేటికి ఆందోళన చేస్తున్నారని గుర్తు చేశారు. కార్పొరేట్ కంపెనీలకు అటవీ ప్రాంతాన్ని అప్పగించడం రాజ్యాంగ విరుద్ధమన్నారు.గిరిజన గ్రామసభ ఆమోదం లేకుండా టిఏసి తీర్మానం చేయకుండా అటవీ ప్రాంతంలో ఏకపక్షంగా రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాలు తీసుకోవడం తగదన్నారు. ఒక ప్లాన్ ప్రకారం గిరిజన ప్రాంతంలో అటవీ వనరులను దోచుకోవడానికి కేంద్ర ప్రభుత్వం ప్రణాళిక రూపొందిస్తుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కుట్రలను అమలు చేయడానికి పాడేరు ఎమ్మెల్యే ఏజెంట్‌గా వ్యవహరించడం బాధాకరమన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం రహస్యంగా పాడేరులో సమావేశం నిర్వహించి కార్పొరేట్ కంపెనీలకు వత్తాసు పలకడం దారుణమన్నారు.గిరిజన చట్టాలను తుంగలో తొక్కి హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మించే ప్రయత్నాన్ని గిరిజనులు అడ్డుకుంటారని, రద్దయ్యే వరకు ఉద్యమం కొనసాగిస్తామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు హెచ్చరించారు.

గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు పాలికి లక్కు మాట్లాడుతూ, గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల మరణాలకు బాధ్యులను చేస్తూ హెచ్‌ఎం, సిబ్బందిని సస్పెండ్ చేయడం సరికాదన్నారు. విద్యార్థులకు వైద్య సేవలు అందించడానికి హెల్త్ అసిసెంట్లను నియమించాలన్నారు. అమ్మఒడితో సంబంధం లేకుండా విద్యార్థులకు కాస్మోటిక్స్ పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.విద్యార్థులకు వైద్య సేవలు అందించడానికి కనీసం ప్రయాణ ఖర్చులు కూడా ప్రభుత్వం ఇవ్వకుండా,మెస్ బిల్లు నుండే సమకూర్చుకోవాలని చెప్పడం సరికాదన్నారు.పాడేరు ఐటిడిఎ పిఓ దుర్మార్గంతో పెదబయలు తహశీల్దార్ ఆత్మహత్యకు పాల్పడినప్పుడు ఇంత వరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. ఈ సమావేశంలో గిరిజన సంఘం పాడేరు మండల అధ్యక్షుడు సోమేలి చిట్టిబాబు, జిల్లా నాయకులు కె.నర్సయ్య, కె.సత్యనారాయణ పాల్గొన్నారు.

టిడిపి నేతల ఆరోపణలు అవాస్తవం

వైస్ ఎంపిపి సుర్ల ఆదినారాయణ

ప్రజాశక్తి-గొలుగొండ : తనపై టిడిపి నాయకులు చేస్తున్న ఆరోపణలో వాస్తవం లేదని గొలుగొండ వైస్ ఎంపీపీ సుర్ల ఆదినారాయణ (బాబ్జి) అన్నారు. మండలంలోని పోట్యం గ్రామంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఆయనపై వచ్చిన ఆరోపణలను ఖండించారు. ఈ సందర్భంగా ఆదినారాయణ మాట్లాడుతూ, తనకు సొంత ఇల్లు ఉండగా జగనన్న కాలనీలో ఇల్లు పొందాలని టిడిపి నాయకులు చేసిన ఆరోపణలో ఏ మాత్రం వాస్తవం లేదన్నారు. తన తల్లికి ఇద్దరు కుమారులని, ప్రస్తుతం నివాసం ఉంటున్న ఇల్లుని తన తల్లి కట్టించిందని ఆయన తెలిపారు. తనకి గతంలో ఇందిరమ్మ గృహంలో ఇల్లు వచ్చినట్లుగా టిడిపి నాయకులు ఆరోపిస్తున్నారని, దానిని నిరూపిస్తే గ్రామాన్ని విడిచి వెళ్లిపోతానని ఆయన ఛాలెంజ్ చేశారు. తనపై ఆరోపణలు చేసిన మాజీ సర్పంచ్ ఆడపురెడ్డి ప్రభాకర్ అదే ఇందిరమ్మ గృహంలో 30 ఎకరాల భూమి కలిగిన తన అక్క పేరున ఇల్లు పెట్టించి బిల్లు మార్చుకున్నారని ఆరోపించారు. గత టిడిపి ప్రభుత్వంలో ఇంకుడు గోతులు తీయించకుండా లక్షలాది రూపాయలు సొమ్మును స్వాహా చేశారని ఆరోపించారు. మాజీ ఎంపీటీసీ నాగిరెడ్డి సత్యనారాయణుడు వైసిపి పార్టీ తరుపున ఎంపీటీసీగా గెలిచి గత ఎన్నికల ముందు టిడిపి పార్టీలోకి వెళ్లారన్నారు. అక్కడ టిడిపి నాయకులు పట్టించుకోకపోతే తమ పార్టీలోకి వస్తానని వారం రోజుల క్రితం మండల స్థాయిలో రాయబారాలు నడిపాడని, తాము వ్యతిరేకించడంతో టిడిపిలో ఉంటూ ఆరోపణలు పేరిట బురదజల్లుతున్నాడని విమర్శించారు. పార్టీలకతీతంగా వైసీపీ ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న అభివృద్ధిని గమనించి ఇప్పటికైనా టిడిపి నాయకులు ఆరోపణలు మానుకోవాలని ఆయన హితవు పలికారు. గ్రామ కమిటీ అధ్యక్షులు పాతల సత్యనారాయణ మాట్లాడుతూ, తమ గ్రామంలో అర్హులకు మాత్రమే జగనన్న ఇళ్లను కేటాయించామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వీఆర్ఓలపై పని ఒత్తిడి తగ్గించాలి

ప్రజాశక్తి -తగరపువలస : వీఆర్ఓలపై పని ఒత్తిడి తగ్గించాలని వీఆర్ఓల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదె శ్రీరాములు డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని తాళ్లవలసలో సంఘం జిల్లా అధ్యక్షులు పోతిన వెంకటలక్ష్మారావు అధ్యక్షతన నిర్వహించిన జిల్లా కార్యవర్గ తొలి సమావేశంలో శ్రీరాములు మాట్లాడారు. ఇటీవల కాలంలో వీఆర్ఓలపై తీవ్రమైన పని ఒత్తిడి వల్ల మానసిక రుగ్మతలు, అనారోగ్యం పాలౌతున్నారన్నారు. క్షేత్రస్థాయిలో వీఆర్ఓలు ఎదుర్కొంటున్న సమస్యలపై జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాలని సమావేశంలో నిర్ణయించారు. సమావేశంలో సంఘం అనకాపల్లి జిల్లా అధ్యక్షులు ఎస్‌టి రామకృష్ణ, ఆనందరావు, విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి జి దేవరాజ్, భీమిలి డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎంవి సుబ్బారావు,ఎం శ్రీనివాసరావు పాల్గొన్నారు.అనంతరం నూతన కార్యవర్గాన్ని అభినందించారు.

పెళ్లి పేరిట మోసం

ప్రజాశక్తి -కొత్తకోట:మైనర్ బాలికను గర్భవతి చేసి పెళ్లికి నిరాకరించిన యువకుని పై ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్టు కొత్తకోట ఎస్సై విభూషణరావు తెలిపారు. బాధిత యువతి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తకోట పోలీస్ స్టేషన్ పరిధి దొండపూడి గ్రామ ఎస్సీ కాలనీలో నివాసం ఉంటున్న పులగజ్జెల శ్రీను (22) ఐటిఐ చేసి గత కొన్నాళ్ళు పాటు దుబాయిలో ప్రయివేట్ పనులు చేసి గ్రామానికి వచ్చాడు. అదే గ్రామ ఎస్సీ కాలనీలో శ్రీను ఇంటి ఎదురుగా ఒకే సామాజిక వర్గానికి చెందిన మైనర్ బాలిక తల్లి మరో దేశం కూలీ పనులు నిమిత్తం వెళ్లగా బంధువుల ఇంటి వద్ద ఉంటూ ఇంటర్ చదువు తూ ఉండేది. ఆమెకు మాయ మాటలు చెప్పి బాలికను శ్రీను లోబర్చు కున్నాడు. ఏడాది కాలంగా ప్రేమ వ్యవహారం నడిపించాడు. ఇద్దరు ఇష్టపడి ఒకటి అయ్యారు. అప్పట్లో పెళ్లి చేసుకోవాలని బాలిక కోరగా నువ్వు మైనర్ అంటూ సర్ది చెబుతూ వచ్చాడు. ఈ నేపథ్యంలో బాలిక పై లైంగికంగా లోచరుకున్నాడు. దీంతో బాలిక ప్రస్తుతం సుమారు ఎనిమిది నెలల గర్భిణీ అయ్యింది. ప్రస్తుతం బాలిక మేజర్ కావడంతో పెళ్లి చేసుకోవాలని మరలా కోరడంతో యువకుడు శ్రీను మొహం చాటయడం మొదలు పెట్టాడు. బాలిక గ్రామ పెద్దలను ఆశ్రయించి యువకున్ని నీల దీయగా తన మేన మామ కూతుర్ని పెళ్లి చేసుకుంటానని తెగేసి చెప్పాడు. దీంతో కొత్తకోట పోలీస్‌లకు శనివారం రాత్రి బంధువుల సాయంతో ఫిర్యాదు చేసింది. దీనిపై అనకాపల్లి డిఎస్పి సునీల్ శనివారం రాత్రి విచారణ చేపట్టారు. యువకుడు శ్రీనుకు పలు విధాలుగా కౌన్సిలింగ్ చేసి సర్ది చెప్పారు. శ్రీను వినక పోవడంతో ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం యువకున్ని చోడవరం కోర్టుకు తరలించారు.

ఇదిలా ఉండగా తనకు శ్రీనుతో వివాహం జరిగేలా ప్రజా సంఘాలు, మహిళా సంఘాలు సహకరించాలని బాలిక కోరింది. యువకుడు తనను కాదని అతని మేన మామ కూతుర్ని పెళ్లి చేసుకోవాలన్న ప్రయత్నంలో తల్లి, మేన మామ అన్నయ్య, అమ్మమ్మ తదితరుల పాత్ర ఉందని స్పష్టం చేసింది. తనను మోసం చేయడానికి సహకరించిన వారిపై కూడా కేసు నమోదు చేసి అదుపు లోకి తీసుకోవాలని డిమాండ్ చేసింది. పెళ్లి చేసుకుంటే తక్షణమే కేసు ఉప సంహరించు కుంటానని పేర్కొంది.

ఉల్లాసభరితంగా వైజాగ్ మారథాన్



వైజాగ్ మారథాన్‌లో పాల్గొన్న ఔత్సాహిక రన్నర్లు

ప్రజాశక్తి- సీతమ్మధార : ప్లాస్టిక్, మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ప్రయోజనాలను వివరిస్తూ నగర ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తూ, వైజాగ్ రన్నర్స్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం సంధ్యా మెరైన్స్ సాగరతీరంలో నిర్వహించిన వైజాగ్ మారథాన్ ఉల్లాసభరిత వాతావరణంగా సాగింది. 21కె, 10కె, 5కె, 3కె నాలుగు విభాగాల్లో నిర్వహించిన మారథాన్‌లో నగరవాసులతో పాటు దేశం నలుమూలల నుంచి వయోభేదం లేకుండా తరలివచ్చిన వేలాదిమంది ఔత్సాహికులు పాల్గొన్నారు. మారథాన్ సందర్భంగా పోలీసులు ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టగా, వాలంటీర్లను, తక్షణ వైద్య సేవల కోసం వైద్యులు, అంబులెన్స్‌లను నిర్వాహకులు అందుబాటులో ఉంచారు. వైజాగ్ రన్నర్స్ సొసైటీ తొలిసారి నిర్వహించిన మారథాన్‌కు భారీ స్పందన రావడంపై సొసైటీ ప్రెసిడెంట్ బాలకృష్ణ రాయ్ హర్షం వెలిబుచ్చారు.

మారథాన్ విజేతలు వీరే

వైజాగ్ మారథాన్ విజేతలుగా 21కె. పురుషుల విభాగంలో రమేష్‌చంద్ర, మహిళల విభాగంలో వడ్డే నవ్య, 10కె పురుషుల విభాగంలో రమేష్, మహిళల విభాగంలో అరుణ శ్రీ విజేతలుగా నిలిచారు విజేతలకు రూ.4 లక్షలకు పైగా నగదు పురస్కారాలను, బహుమతులను నిర్వాహకులు అందజేశారు. కార్యక్రమంలో సంధ్య మెరైన్స్ ఎండీ ఆనంద్, వైజాగ్ రన్నర్స్ సెక్రటరీ శ్రీనివాస్, ట్రెజరర్ రాధిక, జానకిరామ్, రాణా, వివేక్, మాధురి, గాయత్రీ, లీలాప్రసాద్, హర్మీందర్, సతీష్, రాంప్రసాద్, రాజశేఖర్ పాల్గొన్నారు.


తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

వారపు సంతలో విస్తృత తనిఖీలు

ప్రజాశక్తి - సీలేరు : జీకే వీధి మండలం సీలేరు వారపు సంతలో స్థానిక ఎస్ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో ఆదివారం విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. అనుమానితులను ప్రశ్నించి వారి వివరాలు సేకరించారు. మావోయిస్టు ఇన్ఫార్మర్లపై ప్రత్యేక దృష్టి సారించి వారి కదిలికలపై నిఘా పెట్టారు. సీలేరు పరిసర ప్రాంతాల్లో సిఆర్పిఎఫ్ బలగాలను మోహరించి ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు నుంచి వచ్చే పోయే వాహనాలు తనిఖీ చేసి విడిచిపెట్టారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో ఇటీవల ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం తదితర అంశాలను దృష్టిలో పెట్టుకొని పోలీసులు అలర్ట్ అయ్యారు. అపరిచిత వ్యక్తులు ఎవరైనా సంచరిస్తున్నారా? అని వారపు సంతలో ఆరా తీశారు. సంతల్లో విక్రయిస్తున్న నకిలీ వస్తువులపైనా స్థానిక ఎస్ఐ రామకృష్ణ ప్రత్యేక దృష్టి సారించారు.

పోరాటంతోనే 'హైర్ బస్సు' ఒప్పందం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : హైర్ బస్ వర్కర్స్ అందరూ ఐక్యంగా ఉండి పోరాడిన ఫలితంగానే హైర్ బస్సు ఓనర్లు దిగివచ్చి అగ్రిమెంట్ చేసుకున్నారని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ అన్నారు. ఇదే ఐక్యతను మున్ముందు కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఆదివారం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో ఎపిఎస్ ఆర్‌టిసి హైర్ బస్సు వర్కర్స్ యూనియన్ (సిఐటియు) విశాఖ, అనకాపల్లి జిల్లాల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల ప్రయోజనాల కోసం, రక్షణ కోసం నిత్యం పనిచేస్తున్న సిఐటియు విశాఖ జిల్లా మహాసభలు ఈ నెల 22, 23 తేదీలలో అల్లూరి సీతారామరాజు భవనంలో జరుగుతున్నాయని, వీటిని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. యూనియన్ గౌరవ అధ్యక్షులు వి.తులసీరాం మాట్లాడుతూ ఈ నెల 12న అద్దె బస్సుల యజమానులతో జరిగిన ఒప్పందం ప్రకారం సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, అల్ట్రా డీలక్స్, సూపర్ లగ్జరీ డ్రైవర్లకు ఇప్పుడు ఇస్తున్న నెలవారీ వేతనానికి అదనంగా రూ.3 వేలు కలిపి ఇవ్వడానికి యజమానులు అంగీకరించారని చెప్పారు. ప్రతి నెలా 10వ తేదీలోగా జీతాలు ఇవ్వడానికి అంగీకారం కుదిరిందన్నారు. ప్రతి అద్దె బస్సు డ్రైవర్‌కు ప్రతి సంక్రాంతికి రూ.4 వేలు బోనస్ చెల్లించడానికి అంగీకరించారని తెలిపారు. నైట్ హాల్ట్ బస్సు డ్రైవర్‌కు రూ.100 ఇవ్వడానికి అంగీకరించారన్నారు. ఆర్టీసీ యాజమాన్యంతో మాట్లాడి జిల్లా వ్యాప్తంగా వర్తించే విధంగా బస్సు పాసులు ఇవ్వడానికి ప్రయత్నిస్తామని యజమానులు అంగీకరించారని తెలిపారు. సమావేశంలో సిఐటియు నాయకులు వి.కృష్ణారావు, యూనియన్ జిల్లా అధ్యక్షులు కెజెఎ.రావు (శివ), ప్రధాన కార్యదర్శి సిహెచ్.కృష్ణ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలనలో మైనార్టీలకు రక్షణ కరువు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత రాష్ట్రంలో మైనారిటీలకు రక్షణ లేకుండా పోయిందని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి.నజీర్ ఆరోపించారు. జాతీయ మైనారిటీ హక్కుల దినోత్సవం సందర్భంగా ఆదివారం టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మైనారిటీ విభాగాల నాయకుల సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. జగన్ పాలనలో మైనార్టీల మాన, ప్రాణాలకు ముప్పు ఎక్కువ అయిందన్నారు.

మైనార్టీలను ఉచకోత కోస్తున్నారని ఆరోపించారు. అనంతపురం జిల్లాలో క్రైస్తవులపై వైసిపి నేతల దాడులను, బైబిల్ దగ్ధం చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. వైసిపి మైనారిటీ నేతలు ఆ పార్టీకి కట్టు బానిసలు వంటి వారిని విమర్శించారు. కార్యక్రమంలో విశాఖ పార్లమెంట్ నియోజకవర్గం క్రిస్టియన్ మైనార్టీ అధ్యక్షులు ఉరుకూటి డేవిడ్, రాష్ట్ర ముస్లిం మైనారిటీ నాయకులు అబ్దుల్ చిన్న రెహమాన్, జప్రుల, షేక్ బాజ్జీ, మహమ్మద్ గౌస్, జాన్, అంటోని రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సన్ సినోరా బరితెగింపు

వ్యర్థ జలాల అవుట్‌లెట్లను రహదారిమీదకు వదిలేసిన యాజమాన్యం
వ్యర్థాల దుర్వాసనతో అవస్థలు పడుతున్న జనం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

సాగర్‌నగర్ దగ్గరగల సన్ హోటల్ మేనేజిమెంట్ కాలేజీ యాజమాన్యం నెలల తరబడి బరితెగింపునకు దిగింది. హాస్టల్ నిర్వహిస్తూ ఆ వ్యర్థాలనూ, లోపల టాయ్‌లెట్స్ వ్యర్థాలనూ రహదారిపైకి అవుట్‌లెట్ల ద్వారా వదిలేయడంతో దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో సాగర్‌నగర్ – ఎండాడ మధ్యలో నిత్యం రాకపోకలు సాగించే వేలాది మంది అవస్థలు పడుతున్నారు. దుర్గంధం నెలల తరబడి వస్తున్నా, స్థానిక ప్రజల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతున్నా జివిఎంసి అధికారులు పట్టించుకోవడం లేదు. గతంలో గోకరాజు గంగరాజు నిర్వహణలో ఇది ఉండేది. సన్ సినోరా యాజమాన్యం దీన్ని స్వాధీనం చేసుకున్నాక హాస్టల్ మేనేజిమెంట్ చేపడుతోంది. ఆ యాజమాన్యం వ్యర్థాలను నిర్వహించే తీరు అత్యంత దారుణంగా ఉంది. రాజకీయ పలుకుబడితో నెట్టుకుంటూ అభ్యంతరాలను లెక్కచేయనితనంతో వ్యవహరిస్తుందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రూ.కోట్లలో లాభాలొస్తున్నా... నిర్వహణా వైఫల్యాలు

రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి విద్యార్థులు ఇక్కడ హోటల్ మేనేజిమెంట్ కోర్సుల్లో రూ.లక్షలు వెచ్చించి చేరుతుంటారు. వీరికి మెస్, హాస్టల్ నిర్వహణను 'సన్ సినోరా' నిర్వహిస్తోంది. రూ.కోట్లలోనే ఏటా ఈ సంస్థ యాజమాన్యం ఆర్జిస్తోంది. కోర్సులను పూర్తిచేసిన విద్యార్థులు వేర్వేరు చోట్ల హోటల్స్‌లో చెఫ్‌లుగా చేరుతుంటారు. భవనం లోపల వంటలు, టాయ్‌లెట్లకు సంబంధించిన నిర్వహణ అస్తవ్యస్తంగా ఉందని తెలుస్తోంది. ఈ భవనానికి ఎదురుగా ఉండే రోడ్డుపైనే బహిరంగంగా పెద్ద గోతులు తీసేసి లోపల నుంచి వ్యర్థాలన్నిటినీ యాజమాన్యం వదిలేస్తోంది. ఈ భవనానికి ఎదురుగా జనం నిత్యం నడిచే రహదారి ఉంది. దీనిపై ఏరులా వ్యర్థాలు పారుతున్నాయి. రహదారిపైకి లోపల వ్యర్థాలన్నిటినీ వదిలేయడంతో స్థానిక ప్రజలు గతంలో పలుమార్లు అభ్యంతరం చెప్పినా బేఖాతరు చేస్తూ సంస్థను నడిపించడం పలు విమర్శలకు తావిస్తోంది. జివిఎంసి పారిశుధ్య విభాగ అధికారులకు సమాచారం ఉన్నా సరే పట్టించుకోవడం లేదంటూ స్థానిక అపార్టుమెంట్ వాసులు వాపోతున్నారు. ఈ రహదారి నుంచి నడిచి వెళ్లేవారు,



వ్యర్థాలను రోడ్డుపైకి వదిలేస్తున్న సన్ సినోరా సంస్థ

వాహనాలపై వెళ్లేవారు వ్యర్థాలను తప్పించుకుని వెళ్లలేని స్థితి ఎదురవుతోంది. తీవ్ర దుర్గంధం వెదజల్లడంతో దాన్ని పీల్చలేక ముక్కులు మూసుకుంటూ ఈ రహదారి నుంచి వెళ్లడం కనిపిస్తోంది. ఇదే కొనసాగితే ఈ ప్రాంతంలో సన్ సినోరే యాజమాన్య నిర్లక్ష్యం వల్ల జబ్బులు కూడా వ్యాపిస్తాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

'జనరల్ బోగీ' కవితా సంపుటి ఆవిష్కరణ



జనరల్ బోగీ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వెంకట సూర్యారావు, తదితరులు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : అతి సామాన్యుల జీవితాలకు ప్రతీకగా జనరల్ బోగీ దీర్ఘ కవితను చెప్పుకోవచ్చునని ప్రముఖ రచయిత, సాహితీ విశ్లేషకులు డాక్టర్ దామెర వెంకట సూర్యారావు అన్నారు. శ్రీఅరుణం శ్రీనివాస్ విరచిత 'జనరల్ బోగీ' కవితా సంపుటి పుస్తక ఆవిష్కరణ ఆదివారం జరిగింది. పుస్తకాన్ని ఆవిష్కరించిన ఆయన మాట్లాడుతూ అపురూపం అని చెప్పుకునే ఆధ్యాత్మికం ఒకవైపు, ఆస్తులు కూడబెట్టే ఆశ్రమాల పోరు మరోవైపు, అద్భుతం అని చెప్పుకునే వారసత్వం ఒకవైపు, అప్పులతో కట్టుకున్న ప్రగల్భాలు మరోవైపు అంటూ దేశ వాస్తవిక ముఖచిత్రాన్ని శ్రీఅరుణం శ్రీనివాస్ కళ్ళ ముందుంచారని శ్లాఘించారు.

సమాజ శరీరానికి కవి కన్ను లాంటి వాడు అన్నారు. వైజ్ఞానికంగా ఎంత పురోగమించినా, ఈ అంతర్జాల యుగంలోనూ కవిత్వం తన ప్రాధాన్యతను కోల్పోలేదని చెప్పారు. సమావేశానికి కళావేదిక అధ్యక్షుడు డాక్టర్ నండూరి రామకష్ణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాన్యుని శక్తిని, పరిస్థితిని ప్రపంచానికి తెలిసేలా జనరల్ బోగీని శ్రీనివాస్ రచించారన్నారు. సమావేశంలో మెకానికల్ ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాల రిటైర్డ్ అధ్యాపకులు కెఎస్‌ఎన్.ప్రకాశరావు, తెలుగు ఉపన్యాసకులు డాక్టర్ బి.రజని, కళావేదిక కార్యదర్శి శ్రీమణి, పుస్తక రచయిత శ్రీఅరుణం శ్రీనివాస్ పాల్గొన్నారు.

డ్రగ్స్ ముఠా అరెస్టు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నూతన సంవత్సర వేడుకలను ప్రధాన లక్ష్యంగా చేసుకొని డ్రగ్స్ విక్రయానికి ప్రయత్నించిన ఐదుగురు యువకులను నగర పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసు వివరాలను ఆదివారం సాయంత్రం పోలీస్ కమిషనర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డిసిపి - 2 ఆనంద్ రెడ్డి వెల్లడించారు. త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కామత్ హోటల్ వద్ద నిషేధిత మాదక ద్రవ్యమైన ఎండిఎంఎను అమ్ముతున్నారన్న ముందస్తు సమాచారం మేరకు ఆ ప్రాంతంలో దాడి చేసి నగరానికి చెందిన సుంకర ప్రశాంత్, రత్నాల విష్ణువర్ధన్, ఉజ్జల కరుణాకర్, గుజ్జారపు వినాయక భాగ్య తేజ, కర్ణాటక రాష్ట్రం బెంగళూరుకు చెందిన సయ్యద్ అజార్ అలీలను అరెస్టు చేశారు. వారి నుంచి 70 గ్రాముల ఎండిఎంఎ నిషేధిత మాదకద్రవ్యం లభ్యమైంది. ఈ మాదకద్రవ్యాలను వారు బెంగళూరు నుండి విశాఖకు రప్పించి ఇక్కడ ఉన్న కాలేజీ యువతను ప్రధానంగా చేసుకొని అమ్మకాలు సాగిస్తున్నారు. ప్రధాన నిందితుడు సుంకర ప్రశాంత్, అతని స్నేహితుడు బెంగళూరుకు చెందిన సయ్యద్ అజార్ అలీ రెండు లక్షల రూపాయల నగదు పంపి 90 గ్రాముల ఎండిఎంఎను విశాఖకు రప్పించారని, అనంతరం తెలిసిన వ్యక్తుల ద్వారా గ్రామును రూ.4 వేలు నుంచి 5 వేలుకు అమ్మకాలు చేస్తున్నారని పోలీసులకు సమాచారం అందింది. విశాఖ నగరానికి తీసుకువచ్చిన దానిలో కంచరపాలెంకు చెందిన దినేష్ ద్వారా 20 గ్రాములు విక్రయించినట్టు పోలీసులు గుర్తించారు. ఈ నేపథ్యంలోనే దాడులు చేపట్టారు. దినేష్ పరారీలో ఉన్నాడు. అతని కోసం గాలిస్తున్నారు. ఇదే ఏడాది జూలైలో వారు 50 గ్రాముల డ్రగ్స్ విశాఖకు తీసుకువచ్చి విక్రయించారని, అందులో లాభం రావడంతో మరొకసారి నూతన సంవత్సర వేడుకలను లక్ష్యంగా పెట్టుకుని ఈ డ్రగ్స్‌ను విశాఖ తెప్పించినట్టు డిసిపి తెలిపారు. నిందితుల నుంచి ఆరు మొబైల్ ఫోన్లు, ఒక కారు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పట్టుకోవడంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన టాస్క్‌ఫోర్స్ ఎడిసిపి త్రినాథ్‌ను, అతని బృందాన్ని డిసిపి అభినందించారు.

626వ రోజుకు 'ఉక్కు' జెఎసి దీక్షలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను పోరాటాలతో అడ్డుకుంటామని హెచ్‌పిసిఎల్, హెచ్‌ఎస్‌ఎల్ కార్మికులు అన్నారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యాన చేపట్టిన దీక్షలు ఆదివారానికి 626వ రోజుకు చేరాయి. దీక్షల్లో లింగస్వామి, మహమ్మద్ గౌస్ లాల్, పిఎస్‌ఎన్.రాజు, వి.ప్రసాద్, ఎస్.ప్రసాద్ పాల్గొన్నారు.

విద్యుత్ పొదుపుపై అవగాహన

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఒక యూనిట్ విద్యుత్ ఆదా చేస్తే రెండు యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి చేసినట్లేనని ఎపిఇపిడిసిఎల్ జోన్-1 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.సత్యనారాయణ అన్నారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా స్థానిక క్వీన్ మేరీ సెకండరీ స్కూల్‌లో విద్యుత్ పొదుపుపై విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు సదస్సు నిర్వహించారు. అదే విధంగా వైజాగ్ సర్కిల్ ఆఫీసు వద్ద నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో ఎల్.మహేంద్రనాథ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఇంధన వనరులను భవితరాలకు అందించాలంటే ఇంధన పొదుపుపై ప్రతి ఒకరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో డిఇఇ జి.శిరీషా గాయత్రి, ఎఇలు సన్యాసినాయుడు, లోకేశ్వరరావు, కళాశాల ఇంచార్జ్ ధర్మేంధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జీసస్ ప్రేయర్ ఫెలోషిప్, లోకల్ క్రిస్టియన్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో కాలనీ క్రిస్మస్ వేడుకలను ఆదివారం కెఆర్‌ఎం.కాలనీలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎపిఐఐసి డైరెక్టర్ ఎం.అప్పారావు హాజరయ్యారు. కేక్ కట్ చేసి వేడుకల్లో పాల్గొన్నారు. శ్రీకాకుళంకు చెందిన పిఎ.స్వామి వాక్య ప్రసంగీకులుగా వ్యవహరించారు. వేడుకల్లో సండే స్కూల్ పిల్లలు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో జీసస్ ప్రేయర్ ఫెలోషిప్ చర్చ్ నిర్వాహకురాలు శ్యామల విజయ కుమార్, జియోను కింగ్ మినిస్టరీస్ పాస్టర్ కాలేబు, పాస్టర్ ఎం.చంద్రపాల్, పాస్టర్ జార్జి ముల్లోర్ పాల్గొన్నారు.

22న విద్య, ఉపాధి రంగాలపై సదస్సు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విద్యా, ఉపాధి రంగాల సమస్యలుపై ఈ నెల 22న ఉదయం 10.30 గంటలకు పిడిఎస్‌ఒ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ఉత్తరాంధ్ర విద్యార్థుల సదస్సు జరగనుందని సంఘం రాష్ట్ర నాయకులు ఎల్.ఖాన్ కోరారు. ఈ మేరకు ఎవిఎన్ కాలేజీ వద్ద పోస్టర్ ఆవిష్కరించారు. ప్రభుత్వాలు విద్యా సంస్కరణల పేరుతో చేపడుతున్న విధానాలు ప్రభుత్వ విద్యను కుదేలు చేసి, కార్పొరేట్లకు లాభాలు కట్టబెట్టే వైపుగా ఉన్నాయన్నారు.